మినీకథ

# త్రిమూర్తులు



- ఇందిరా సుధాకర్

"సుజాతా! నేను ఈ రోజు సాయంత్రం వరకూ హాస్పిటల్‌కి రాను. నీకేం కావాలన్నా రడీగా లాకర్ మీద పెట్టాను. ఈ డబ్బులు నీ దగ్గర ఉంచు. ఏమైనా అవసరం ఉంటే ప్రక్క బెడ్‌లో ఉన్న ఆమె భర్త సహాయం చేస్తాన న్నారు. నేను పాస్‌ల కోసం ప్రయత్నం చేసుకోవాలి" అన్నారు మావారు.

"సరే వెళ్ళండి. పిల్లల్ని జాగ్రత్తగా అక్కావాళ్ళింట్లో దించెయ్యండి. శని, ఆదివారాలు శలవు కదా!" అన్నాను నేను.

నేను వారం రోజుల నుండి అనారోగ్య కారణంగా హాస్పిటల్‌లో ఉన్నాను.

మా పిల్లలు బి.హెచ్.పి.విలో చదువుతున్నారు. ఈ మధ్య వాళ్ళను దగ్గరుండి తీసుకొని రావడానికి మావారు అక్కడకు వెళ్తూ బ్యాగ్ పోగొట్టుకున్నారు. డ్యూటీ పాస్‌లు, ఐడెండిటీకార్డు, హాస్పిటల్ స్లిప్స్, రిపోర్టులు మొదలైనవి ఒక జిప్ బ్యాగ్‌లో పెట్టుకొని, దానిని ఒక హేంగింగ్ బాగ్‌లో పెట్టుకొని బి.హెచ్.పి.వి స్టేట్ బ్యాంకు దగ్గర ఆగారు. జిప్ బ్యాగ్‌లో బాగా క్యాష్ ఉంటుందనుకొని ఎవరో నెమ్మదిగా కాజేశారు.

మావారు చాలా బాధపడ్డారు. సోమవారం "డ్యూటీలో జాయిన్ కావాలంటే పాస్‌లు లేవు. ఆయన కనీసం డూప్లికేట్ పాస్‌లు సంపాదించాలన్నా చాలా కష్టం. అసలే వారంరోజుల నుంచి నాకోసం, పిల్లల కోసం, పాస్ పోయిందనే బాధతో తిరిగి తిరిగి విసిగిపోతున్నారు.

నేను పేపరు ప్రకటన గాని, రేడియోలో కానీ, టి.విలో కానీ ప్రకటన ఇయ్యండి. దొరికితే బహుమానం యిద్దాం అన్నాను. సరే మన ప్రయత్నం మనం చేద్దాం అని ఆయన అన్నారు. ఈలోగా సోమవారం ఆయనకు మల్కాపురం పోస్టుమాస్టారి దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది. అందులో మావారి జిప్ బ్యాగ్ ఆయన దగ్గర భద్రంగా ఉందనీ, ఎవరినైనా విట్‌నెస్‌కి తీసుకొని వచ్చి అది తీసుకొని వెళ్ళమని క్లుప్తంగా వ్రాసి ఉంది.

మేం ఇద్దరం ఆశ్చర్యపోయాం. ఆ తర్వాత ఆనందించాం. పోనీ ఎలాగైతేనేం బ్యాగ్ దొరుకుతున్నందుకు ఆయన మంగళవారం పోస్టుమాస్టారి దగ్గరకు వెళ్తే జరిగిన సంగతి తెల్సింది.

దొంగ ఎవడో కొంచెం చదువుకున్న వాడై ఉండాలి. బ్యాగ్‌లో క్యాష్ లేకపోయినా మిగిలినవన్నీ చూసి మరలా బ్యాగ్ మూసి క్షేమంగా దానిని పోస్టుబాక్సులో వేశాడనీ, బాక్స్ తెరిచిన ఉద్యోగి కూడా దానిని నిర్లక్ష్యంగా విసిరేయక పోస్టుమాస్టారికి భద్రంగా అందిస్తే, ఆయన స్వయంగా ఆ విషయం కార్డుద్వారా మావారికి తెలియజేసి మా ఆత్రుత తగ్గించారు.

ఇది తెలిసిన మా ఆనందానికి అవధులు లేవు. దొంగ ఎవరో అజ్ఞాత వ్యక్తి. కానీ మానవత్వంతో ఆ బ్యాగ్‌ను డైరెక్టుగా ఎలా అందజేయాలో తెలియక ఆ పద్ధతి అవలంభించాడు. పోస్టల్ ఉద్యోగి కూడా విధి నిర్వహణలో బాధ్యతగా దానిని పోస్టుమాస్టారికి అందించడం విశేషం. ఆ కాగితాలు పారేసి, బ్యాక్ వాడుకో వచ్చుకదా! ఎవరైనా. కానీ ఆ ముగ్గురూ ఆ పని చేయలేదు. ప్రత్యేక శ్రద్ధతో తిరిగి మా కందించారు. ఆ ముగ్గురూ నిజంగా మనుష్యులలో దేవుళ్ళే. వాళ్ళు ముగ్గురూ త్రిమూర్తులే అనిపించింది ఆ క్షణం నిజంగా మరవురానిది. ◆


మాయలూ,
వళ్లు గగుర్పొడిచే
మాంత్రికుడి మంత్రాలు
ఆకాశమంత ఎత్తుండే
కొండలు,
ఆ కొండల్లో వింత గుహలు
పిల్లల కోసమే కాదు,
పెద్దలు కూడా
హాయిగా చదువుకుని
మళ్లీ చదువుకుని
ఆనందించే
ఫాంట'సీ' సీరియల్



అనగనగా అందాల రాకుమారి
మాచిరాజు కామేశ్వరరావు
పిల్లల సీరియల్
అతి త్వరలో